# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

మంగళవారం 19, మే 2026 సంపుటి :03 సంచిక :101 పేజీలు :05 వెల ₹5


## శాశ్వత పరిష్కారం చూపాలి

- ప్రజా సమస్యలపై వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

02





## సానిత్ రావుకు అభినందనలు

- ఎప్ సెట్ లో సానిత్ రావుకు 164వ ర్యాంకు

టీజీ ఎప్ సెట్ ఫలితాల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ లో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడ గ్రామానికి చెందిన పిన్నింటి వెంకటేశ్వర్ రావు, పద్మశ్రీ దంపతుల కుమారుడు సానిత్ రావు రాష్ట్రస్థాయిలో 164వ ర్యాంకు సాధించాడు. సానిత్ రావు చురుకైన విద్యార్థి. చదువులో తన ప్రతిభతో ప్రశంసలు పొందుతున్నారు. ముందస్తు ప్రణాళికతో హైదరాబాద్ నారాయణ విద్యాసంస్థల్లో చేరిన సానిత్ రావు డీన్ సాయిలక్ష్మి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రమేష్ ప్రోత్సాహం, లెక్చరర్స్ అనుభవంతో తాజాగా వెలువడిన ఎప్ సెట్ ఫలితాల్లో 164వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా సానిత్ రావుకు పలువురు అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన నీట్ పరీక్షల్లో కూడా సానిత్ రావు విశేష ప్రతిభ కనబరిచాడు.

–అక్షరదర్బార్, హనుమకొండ

# పుష్కర ముస్తాబు

## తుది దశకు పుష్కరాల పనులు

- ప్రధాన ఘాట్ నుంచి సరస్వతి ఘాట్ వరకు తాత్కాలిక రోడ్డు
- గజ ఈతగాళ్లతో నదిలో నాటు పడవల ద్వారా పహారా
- ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉండేలా నిర్ణయం
- తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్స్ వరకు ఉచిత షటిల్ బస్సులు
- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడి
- అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం
- 12 రోజులు చాలా ప్రధానమని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు

02






భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లు తుది దశకు చేరాయి. ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు జరిగే పుష్కరాలు గురువారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా ఇప్పటికే వివిధ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో కాళేశ్వరం వద్ద సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణపై అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి ఏర్పాట్లను కూడా పరిశీలించారు. సరస్వతి అంత్య పుష్కరాల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో పుష్కర విధులు కేటాయించిన అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఈ 12 రోజులు చాలా ప్రధానమని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

- అక్షరదర్బార్, కాళేశ్వరం

## ఘోర రోడ్డు ప్రమాదం

- భార్యాభర్తలు రమేష్, పూలమ్మ మృతి
- పాల్తియ తండాలో విషాద ఛాయలు

03



## 'వరద ముంపు' మాక్ డ్రిల్

- క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీ కవిత
- రంగంలోకి ఎస్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్, మున్సిపల్ బృందాలు
- ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో ఆపరేషన్.. డ్రోన్ల ద్వారా ఆహార ప్యాకెట్ల పంపిణీ

03



# తుది దశకు పుష్కరాల పనులు

- ప్రధాన ఘాట్ నుంచి సరస్వతి ఘాట్ వరకు తాత్కాలిక రోడ్డు
- గజ ఈతగాళ్లతో నదిలో నాటు పడవల ద్వారా పహారా
- ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉండేలా నిర్ణయం
- తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్స్ వరకు ఉచిత షటిల్ బస్సులు
- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడి
- అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం
- 12 రోజులు చాలా ప్రధానమని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు



అక్షరదర్బార్, కాళేశ్వరం : భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లు తుది దశకు చేరాయి. ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు జరిగే పుష్కరాలు గురువారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా ఇప్పటికే వివిధ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో కాళేశ్వరం వద్ద సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణపై అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి ఏర్పాట్లను కూడా పరిశీలించారు. సరస్వతి అంత్య పుష్కరాల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో పుష్కర విధులు కేటాయించిన అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఈ 12 రోజులు చాలా ప్రధానమని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.





### 12 రోజులు చాలా ముఖ్యం

ఈ 12 రోజులు చాలా ముఖ్యమని ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమన్వయంతో పని చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దేవాలయంలో భక్తులు క్యూలైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. భక్తులు నదిలోకి వెళ్లకుండా గజ ఈతగాళ్ళతో నాటు పడవల ద్వారా పహారా నిర్వహించనున్నట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్స్ వరకు భక్తుల సౌకర్యార్థం ఉచితంగా షటిల్ బస్సులు నడపాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , డీఆర్వో వసంత కుమారి, భూపాలపల్లి, కాటారం ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్ అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కాళేశ్వరం వద్ద సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి పరిశీలించారు.

### అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో గత సంవత్సరం పెద్ద ఎత్తున సరస్వతి పుష్కరాలు జరుపుకున్నామని, ఆవిధంగానే అంత్య పుష్కరాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతిరోజు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి అధికారికి కేటాయించిన విధులను బట్టి ఆయా ప్రాంతాల్లో ముందస్తుగా పర్యటించి ఏర్పాట్లు పరిశీలన చేయాలని ఆదేశించారు. గైర్హాజరైన అధికారులకు, సిబ్బందికి మెమోలు జారీ చేయాలని, తగు చర్యలు నిమిత్తం ఆయా శాఖలకు సిఫారసు చేయనున్నట్లు ఆయన స్పష్టంచేశారు. 21వ తేదీ ఉదయం 5.30 గంటలకు పుష్కరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి రోజు స్వామీజిలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రోటో కాల్ పాటించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. సమాచారం సమగ్రంగా అందించేందుకు కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేయనున్నామని, అలాగే వాకి టాకీ ద్వారా దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రత్యేక వైద్యులను అందుబాటులో ఉంచాలని తెలిపారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- యూత్ కాంగ్రెస్ చిట్యాల మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్



అక్షర దర్బార్, చిట్యాల: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని ఆ పార్టీ యూత్ మండల అధ్యక్షులు అల్లకొండ కుమార్ కోరారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అల్లకొండ కుమార్ మాట్లాడుతూ.. భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు , జిల్లా యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ ఆదేశానుసారం అతి తొందరలోనే మండల యూత్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు దిశగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలోని అన్ని గ్రామశాఖ యూత్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రజాప్రభుత్వంలో ప్రజలకు అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి యూత్ కాంగ్రెస్ నాయకుడు కృషి చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మ కిరణ్ గౌడ్, గోల్కొండ నాగరాజు, ఎలగొండ చిరంజీవి, తీగల నాగరాజు, గోపగాని శివ, చిట్కూరి రాజు, నీలేష్, భద్రి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథగా మారిన నిరుపేద కుటుంబానికి కౌన్సిలర్ పూర్ణచారి ఆసరా

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 7వ వార్డు 45వ బూత్ పరిధిలో అరె కుటుంబానికి చెందిన అతి నిరుపేద యువకుడు కుసుంబా రాకేష్ (17) అనారోగ్య కారణాలతో అకాల మరణం చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఉండడానికి సొంత ఇల్లు కూడా లేకపోవడంతో కుటుంబ సభ్యులు దయనీయ పరిస్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పి, వారి కష్టసమయంలో అండగా నిలిచారు. సాయం చేయాలన్న ఉద్దేశంతో బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. పేదల కష్టాలను గుర్తించి వెంటనే స్పందించిన పూర్ణచారి మానవత్వానికి స్థానికులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 45 వ బూత్ అధ్యక్షుడు సంఘ నరేష్, బిజెపి పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, నాయకులు దాసరి రవి, ముల్కలపెల్లి రఘు, రాజేష్, సాగర్, రవీందర్, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## శాశ్వత పరిష్కారం చూపాలి

- ప్రజా సమస్యలపై వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ప్రతి సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో కమిషనరేట్ పరిధిలోని ఫిర్యాదుదారులు తమ సమస్యలను పోలీస్ కమిషనర్ కి స్వయంగా తెలియజేశారు. సమస్యలను విన్న సీపీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి శాశ్వత పరిష్కారాలు చూపాలని, బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడే పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. పోలీసు ముఖ్య కార్యాలయంలో దాదాపు 10 ఫిర్యాదులను స్వీకరించడం జరిగింది. వచ్చిన ఫిర్యాదులలో



కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, కేసుల పురోగతి, భూ సమస్యలు, తదితర విషయాలు ఉన్నట్లు సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా అసంఘిక కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్నా 8712685257 నంబర్ కు వాట్సప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# మత్తు ముఠాకు గట్టి షాక్

- గంజాయి రవాణా కేసులో ఇద్దరికి 10 ఏళ్ల కఠిన జైలు శిక్ష
- ఒక్కొక్కరికి రూ. లక్ష జరిమానా విధించిన ములుగు జిల్లా కోర్టు
- పోలీసులను అభినందించిన ఎస్పీ సుధీర్ రామ్నాద్ కేకన్



అక్షరదర్బార్, ములుగు : మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ములుగు జిల్లా పోలీసులు కఠిన చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ పాత గంజాయి కేసులో ములుగు జిల్లా, సెషన్స్ కోర్టు సోమవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. నిందితులిద్దరికీ 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు చెరొక రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎస్ వీ పీ సూర్య చంద్రకళ తీర్పునిచ్చారు. కోర్టు శిక్ష ఖరారు చేసిన వారిలో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం రంగంపేట పల్తియా తండాకు చెందిన పల్తియా శంకర్, వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్ నగర్‌కు చెందిన బూడిద శ్రీకాంత్ ఉన్నారు. 2020లో తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో వీరిపై క్రైమ్ నెంబర్ 128/2020 కింద ఎన్‌డీపీఎస్ యాక్ట్, ఎంవీ యాక్ట్ ప్రకారం కేసు నమోదైంది. కోర్టులో నిరూపితమైన సాక్ష్యాధారాల ఆధారంగా న్యాయమూర్తి ఈ శిక్ష ఖరారు చేశారు.

### విచారణలో కీలక పాత్ర పోషించిన అధికారులు

ఈ కేసును త్వరితగతిన తార్కిక ముగింపునకు తీసుకురావడంలో పోలీస్, న్యాయ విభాగం సమన్వయంతో పనిచేశాయి. అప్పటి తాడ్వాయి ఎస్ఐ జి రవీందర్ ఫిర్యాదు చేయగా, పస్రా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ శ్రీనివాస్ దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. డీసీఆర్‌బీ డీఎస్పీ ఈ కిషోర్ కుమార్ కోర్టు మానిటరింగ్ అధికారిగా, డీసీఆర్‌బీ ఎస్ఐ నాగరాజు లైజనింగ్ అధికారిగా వ్యవహరించారు. కోర్టు విచారణ సమయంలో పస్రా సీఐ పి దయాకర్, తాడ్వాయి ఎస్ఐ కె జగదీష్ హాజరయ్యారు. ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు చి సత్యనారాయణ, డి రామ్ సింగ్ సమర్థవంతంగా వాదనలు వినిపించగా, సీడీవోలు బీ గిరివాసు, వి మౌనిక కీలక సాక్ష్యాలను కోర్టు ముందుంచారు.

### మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

కేసును విజయవంతంగా నడిపించి నిందితులకు శిక్ష పడేలా చేసిన అధికారులను, ప్రాసిక్యూషన్ బృందాన్ని జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచారని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోకుండా కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు.

# పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ దాడి

- 10 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్
- రూ.1.91 లక్షల నగదు, 10 మొబైల్ ఫోన్లు స్వాధీనం



అక్షరదర్బార్, హనుమకొండ : హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో సాగుతున్న ఓ పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం మెరుపు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన ఈ సోదాల్లో భారీగా నగదుతో పాటు 10 మంది పేకాట రాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టాస్క్ ఫోర్స్ బృందానికి అందిన సమాచారం ప్రకారం.. సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరా నగర్‌లో గల కొక్కిరాల రవీందర్ ఇంట్లో కొందరు వ్యక్తులు రహస్యంగా పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై నిఘా పెట్టిన టాస్క్ ఫోర్స్ అధికారులు హఠాత్తుగా దాడి చేశారు. ఈ దాడిలో జూదం ఆడుతూ అడ్డంగా దొరికిపోయిన 10 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నగదు రూ.1,91,150, పది స్మార్ట్‌ఫోన్లు, పేకాట కార్డుల సెట్లు స్వాధీనం చేసుకున్నారు. సోదాల అనంతరం పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొమ్ము, మొబైల్ ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సుబేదారి పోలీసులకు అప్పగించారు. పోలీసుల దాడిలో పట్టుబడిన నిందితుల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులే ఎక్కువ మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొక్కిరాల రవీందర్, నంగునూరి మనోహర్, దేశిని కోటేశ్వర్, కమారపు సత్యనారాయణ, రత్నాకర్ రెడ్డి, బుస్సా లింగమూర్తి, పాలపల్లి రజినీకాంత్, బిజ్జల్ నవీన్, రాపాక రఘు, రాచర్ల గోపి పట్టుబడిన వారిలో ఉన్నారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ మధుసూధన్ పర్యవేక్షణలో జరిగిన ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జి బాబులాల్, ఆర్ఎస్ఐ ఓ భాను ప్రకాష్, ఎస్ఐ ఉప్పలయ్య ఇతర టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

- భార్యాభర్తలు రమేష్, పూలమ్మ మృతి
- పాల్తియతండాలో విషాద ఛాయలు





అక్షరదర్బార్, నర్సంపేట: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ శివారులో జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు ఒక బైకును బలంగా ఢీకొట్టడంతో, దానిపై ప్రయాణిస్తున్న దంపతులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర శోకాన్ని నింపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని పాల్తియతండాకు చెందిన రమేష్, పూలమ్మ దంపతులు తమ ద్విచక్రవాహనంపై నర్సంపేట వైపు వస్తున్నారు. ఈ క్రమంలో నర్సంపేట పట్టణ శివారులోని జాతీయ రహదారిపైకి రాగానే, ఎదురుగా అతి వేగంగా వచ్చిన ఒక కారు వీరి బైకును బలంగా ఢీకొట్టింది.

### అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు..

కారు ఢీకొట్టిన తీవ్రతకు దంపతులిద్దరూ బైక్ పైనుంచి గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు. తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో రమేష్, పూలమ్మ ఇద్దరూ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నర్సంపేట పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### తండాలో విషాదం

రమేష్, పూలమ్మ దంపతుల అకాల మరణ వార్త వినగానే గూడూరు మండలంలోని పాల్తియతండాలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. భార్యాభర్తలిద్దరూ ప్రమాదంలో చనిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

# ‘వరద ముంపు’ మాక్ డ్రిల్

- క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీ కవిత
- రంగంలోకి ఎస్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్, మున్సిపల్ బృందాలు
- ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో ఆపరేషన్.. డ్రోన్ల ద్వారా ఆహార ప్యాకెట్ల పంపిణీ




అక్షరదర్బార్, హనుమకొండ : ప్రకృతి విపత్తులు, వరదలు సంభవించినప్పుడు ప్రభుత్వ యంత్రాంగం ఎలా స్పందించాలి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలనే అంశంపై హనుమకొండలో సోమవారం భారీ ‘మాక్ ఎక్సర్సైజ్ (డ్రిల్)’ నిర్వహించారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ మార్గదర్శకాల ప్రకారం.. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఈ విన్యాసాలు విజయవంతంగా కొనసాగాయి. ఉదయం స్నేహ నగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్ (స్టేజింగ్ ఏరియా) నుండి రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్), డీఆర్ఎఫ్, అగ్నిమాపక, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల సిబ్బంది ప్రత్యేక వాహనాలు, లైఫ్ బోట్లతో ముంపు ప్రాంతాలకు బయలుదేరారు.

### ఏడు ప్రాంతాల్లో ఆపరేషన్.. డ్రోన్ల ద్వారా రెస్క్యూ

నగరంలోని ఏడు వరద ప్రభావిత ప్రాంతాలలో ఏకకాలంలో సహాయక చర్యలు చేపట్టారు. టీఎన్జీవోస్ కాలనీ ఫేజ్-2లో ఎమర్జెన్సీ సైరన్ మోగించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఎస్డీఆర్ఎఫ్ అధికారి రవి, జిల్లా అగ్నిమాపక అధికారి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో బాధితులను సురక్షితంగా పునరావాస కేంద్రానికి తరలించారు. వివేక్ నగర్ లో వరద ముంపు వల్ల మూడంతస్తుల బిల్డింగ్‌పై చిక్కుకున్న కాలనీవాసులకు డ్రోన్ల ద్వారా ఆహార ప్యాకెట్లను అందించారు. అనంతరం రెస్క్యూ బృందాలు తాళ్ల సహాయంతో వారిని కిందకు దించి కాపాడారు. సమ్మయ్య నగర్ ప్రభుత్వ పాఠశాల పక్కన చిక్కుకున్న వారిని తాళ్లు, స్ట్రెచర్ల సహాయంతో సురక్షితంగా బయటకు తెచ్చి ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ప్రగతి నగర్, గోపాలపూర్ జవహర్ కాలనీ, టీవీ టవర్ కాలనీలలో కూడా సహాయక చర్యలు ముమ్మరంగా సాగాయి. వరద బాధితుల కోసం స్నేహ నగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాలులో రిలీఫ్ క్యాంపు ఏర్పాటు చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో వైద్యులు బాధితులకు తక్షణ చికిత్స అందించారు. క్యాంపులో బెడ్లు, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లతో పాటు అల్పాహారం, భోజన వసతులను అధికారులు కల్పించారు.

### ముందస్తు సిద్ధతతోనే ప్రాణ, ఆస్తి నష్టాల నివారణ.

మాక్ డ్రిల్ సహాయక చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా ప్రధానంగా అర్బన్ ఫ్లడింగ్, ఫ్లాష్ ఫ్లడ్స్ వంటి విపత్తులకు గురయ్యే ప్రాంతమని తెలిపారు. గత ఐదేళ్లలో మూడు సార్లు భారీ వరదలు వచ్చాయని, గతేడాది సైక్లోన్ల వల్ల సాధారణ జీవనం స్తంభించిందని గుర్తుచేశారు. "గతంలో విపత్తుల సమయంలో 'ఫైర్ ఫైటింగ్ అప్రోచ్' (తక్షణ అత్యవసర చర్యలు) మాత్రమే ఉండేది. కానీ ఇప్పుడు ముందస్తు ప్రణాళిక, సమగ్ర సమన్వయంతో పనిచేస్తున్నాం. దీనికోసం ప్రత్యేకంగా ‘ఇన్సిడెంట్ కమాండ్ పోస్ట్’ ఏర్పాటు చేశాం. ఒక కమాండర్ ఆధ్వర్యంలో 12 విభాగాల అధికారులు సమన్వయంతో రెస్క్యూ, రిలీఫ్, కమ్యూనికేషన్, వైద్య సేవలు అందిస్తారు. ఆసుపత్రులు కూడా అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో ఈ మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించాం" అని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అదనపు కలెక్టర్ ఎన్ రవి, డీఆర్ఓ శ్రీనివాస్, ఏసీపీ నరసింహారావు, జీఎం ఇండస్ట్రీస్ నవీన్ కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారి నాగరాజు, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఫైర్ ఆఫీసర్ శంకర్ లింగం, డీడబ్ల్యూఓ విశ్వజ, తహసిల్దార్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఎంపీడీఓ రామకృష్ణ
- నడికూడలో ఉత్సాహంగా సాగిన వాక్‌థాన్, యోగ కార్యక్రమాలు




అక్షరదర్బార్, నడికూడ: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నడికూడ మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన రెండు కిలో మీటర్ల వాక్‌థాన్, యోగ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతిరోజూ కనీసం 45 నిమిషాల పాటు యోగ, వాకింగ్ వంటి వ్యాయామాలకు కేటాయిస్తే ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఆయుష్షు పెరుగుతుందని తెలిపారు. యోగ ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. ఇదే సమయంలో ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన, ప్రైవేట్ పాఠశాలల కంటే సర్కారు బడుల్లోనే ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ రవిబాబు, ఎస్ఐ పవన్, ఎంపీఓ మార్గవి రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయం

అక్షరదర్బార్, దుగ్గొండి: అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి చికెన్ సెంటర్ యజమాని ఆర్థిక సహాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. దుగ్గొండి మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన ఆవుల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఆయన పనిచేసే చికెన్ సెంటర్ ఓనర్ డ్యాగం ప్రతాప్ సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రమేష్ మృతి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా రూ. 10,000 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్యాగం శివాజీ, సర్పంచులు రాస రమ చేరాలు, బండారి రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తకొండ రవివర్మ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన బీజేపీ నేత కీర్తి రెడ్డి

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను ఆ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు బిస్కుల రవి, అలాగే గాంధీనగర్ గ్రామానికి చెందిన దళిత మోర్చా జిల్లా నాయకుడు రత్న రమేష్ తల్లి రత్న సమ్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కీర్తి రెడ్డి వారి స్వగృహాలకు వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి వెంట బీజేపీ మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, నేతలు పంచిక మహేష్ యాదవ్, రావుల రాకేష్ తదితరులు ఉన్నారు.

## ఐకమత్యంతోనే ఆదర్శ గ్రామాల నిర్మాణం: వసంత

- గాంధీనగర్‌లో ఘనంగా బాలవికాస గ్రామసభ

అక్షర దర్బార్, ములుగు: గ్రామ ప్రజలందరూ కట్టుబాట్లు, నియమాలు పాటిస్తూ ఐక్యమత్యంతో ఒకే మాటపై నిలిస్తే ఆదర్శ గ్రామాన్ని సాధించుకోవచ్చని బాలవికాస ఆదర్శ గ్రామం పథకం సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత పేర్కొన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం గాంధీనగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో సుమారు 350 మందితో ఆదర్శ గ్రామ నిర్మాణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ కేవలం సిమెంట్ రోడ్లు, భవనాలు నిర్మించుకోవడం మాత్రమే అభివృద్ధి కాదని, ఊరి ప్రజలు ఆలోచనలు పంచుకుంటూ స్థానిక వనరులతో సమస్యలను పరిష్కరించుకోవడమే ఆదర్శ గ్రామ లక్షణమని తెలిపారు. అనంతరం సర్పంచ్ నిర్మల మాట్లాడుతూ బాలవికాస సంస్థ తమ గ్రామాన్ని ఎంపిక చేయడం సంతోషకరమని, గ్రామ అభివృద్ధి కమిటీల ద్వారా స్వచ్ఛందంగా శ్రమించేందుకు ప్రజలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వల్లపు మహేష్, పంచాయతీ కార్యదర్శి రఘు, బాలవికాస ప్రతినిధి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ డ్రగ్స్ అమ్మకాలను నిషేధించాలి

- కెమిస్ట్ అండ్ డ్రాగిస్ట్ అసోసియేషన్
- ఈ నెల 20న మెడికల్ షాపుల బంద్‌కు పిలుపు

అక్షర దర్బార్, చిట్యాల: ఆన్‌లైన్‌లో డ్రగ్స్ సరఫరాను తక్షణమే నిషేధించాలని డిమాండ్ చేస్తూ డ్రాగిస్ట్ అండ్ కెమిస్ట్ చిట్యాల మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీఐ మరియు తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుర్రపు తిరుపతి గౌడ్, సిలగాని నాగరాజు మాట్లాడుతూ ఆన్‌లైన్ ఫార్మసీల ద్వారా నార్కోటిక్స్ డ్రగ్స్ కూడా అక్రమంగా సరఫరా అవుతున్నాయని, దీనివల్ల యువత జీవితాలు నాశనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై కఠిన నిఘా పెట్టాలని కోరారు. ఆన్‌లైన్ విక్రయాలకు నిరసనగా ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త బంద్‌లో భాగంగా మండలంలోని మెడికల్ షాపులన్నీ మూసివేస్తున్నట్లు ప్రకటించారు. అత్యవసర పరిస్థితుల్లో మందులు కావాల్సిన వారు స్థానిక ప్రతినిధుల ఫోన్ నంబర్లలో సంప్రదిస్తే అందిస్తామని, ప్రజలంతా ఈ బంద్‌కు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



# దేవునిగుట్ట అడవుల్లో 'మాక్ డ్రిల్'

- పరిశీలించిన కలెక్టర్ బోర్ఖడే హేమంత్
- అడవులకు నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవు




అక్షర దర్బార్, ములుగు: ములుగు జిల్లా తాడ్వాయి డివిజన్ పరిధిలోని తాడ్వాయి టీ రేంజ్, లవ్వల సెక్షన్ దేవునిగుట్ట వెస్ట్ బీట్‌లో అడవి మంటల నిర్వహణపై ములుగు జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు. సోమవారం జరిగిన ఈ విన్యాసాల తీరును జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా తో కలిసి ఆయన పర్యవేక్షించారు. 39వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్ సింగ్ ఠాకూర్ ఈ మాక్ డ్రిల్‌కు పరిశీలకుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అడవి మంటలు సంభవించడానికి గల కారణాలు, వాటిని నివారించే చర్యలపై అవగాహన కల్పించారు. ఉద్దేశపూర్వకంగా అటవీ ప్రాంతానికి హాని కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విన్యాసంలో భాగంగా సిబ్బంది బ్లోయర్స్, రేకర్స్, బీటర్స్, ఫైర్ రేక్ వంటి అగ్నిమాపక పరికరాల వినియోగాన్ని, మంటలు వ్యాపించకుండా కౌంటర్ ఫైర్ లైన్లను సృష్టించే విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, పోలీస్, ఫైర్, వైద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.